క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: సీఎంఆర్‌ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) పేదలకు వరమని మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండల కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో వడ్డి రామకృష్ణకు మంజూరైన రూ.2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంత్రి, డిప్యూటీ సీఎం కలిసి సోమవారం అందజేశారు. కొన్నాళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామకృష్ణ గాయాలపాలై, చికిత్స చేయించుకుంటుండగా, వైద్య ఖర్చుల కోసం సాయం చేయమని ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన నగదును బాధితుడికి వారు అందజేశారు.

బాధితురాలికి వైఎస్సార్ బీమా తక్షణసాయం



బాధితురాలికి నగదు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రాజాం: మండలంలోని పాగిరి గ్రామంలో బగ్గ ఉదయ్‌భాస్కర్‌నాయుడు ఇటీవల మృతి చెందగా, ఆయన భార్య ఉషకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల ఆర్థికసాయం సోమవారం అందజేశారు. మిగిలిన నగదును ఆమె బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని సర్పంచ్ పాగిరి కృష్ణవేణి, పాగిరి లెనిన్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.వెంకటరమణ, సచివాలయ ఉద్యోగులు ఎస్.భారతి, మోహన్‌కృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు పత్రాల పంపిణీ



రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత శ్రీనివాసరావు

వంగర: మండలంలోని రుషింగి గ్రామంలో రైతులకు భూహక్కు పత్రాలను వైఎస్సార్ సీపీ సీనియర్ నేత యలకల శ్రీనివాసరావు చేతులమీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఇటీవల ప్రభుత్వం గ్రామంలో చేపట్టిన భూముల రీసర్వే పూర్తి కావడంతో అన్నదాతలకు భూహక్కు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో 24 గంటలు సేవలు



ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)ల్లోని సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి, 24 గంటలూ సేవలందించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆదేశించారు. సోమవారం మండలంలోని పిరిడి గ్రామంలో ఉన్న పీహెచ్‌సీని సందర్శించిన ఆయన రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ఆస్పత్రికి వచ్చే రోగులను బాగా చూసుకోవాలని, వారికి కావాల్సిన సేవలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, సర్పంచ్ తుట్ట వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామ అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి వారికి కర్నూలుకు చెందిన శ్రీ సిద్ధేశ్వర భజన బృందం సభ్యులు, గ్రామస్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను తెలుసుకుని, ఇక్కడకు వచ్చామని వారు అన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో కీర్తిప్రియా సత్తా



కీర్తిప్రియాను అభినందిస్తున్న ఎంఈవోలు తిరుమలప్రసాద్, పెంటయ్య

రామభద్రపురం: జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడామైదానంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థిని కీర్తిప్రియా సత్తాచాటింది. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో చదువుతున్న కీర్తిప్రియా సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలోనూ, 50 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానం, ఫ్లో వాక్ పోటీల్లో తృతీయ స్థానం సాధించిందని ప్రత్యేక ఉపాధ్యాయురాలు రాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు సదరు విద్యార్థినిని ఎంఈవోలు తిరుమల ప్రసాద్, పెంటయ్య అభినందించారు.

వైఎస్సార్ సీపీతోనే..

అభివృద్ధి, సంక్షేమం

• పింఛన్ల పంపిణీలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



రాజాం: లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రాజాం: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని, మాట తప్పని, మడమ తిప్పని నేతగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో సోమవారం జరిగిన కొత్త పింఛన్ల పంపిణీకి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్మన్.. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్‌తో కలిసి లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. అన్నివర్గాల ప్రజలను ఆర్థికంగా ఆదుకున్న ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99.5 శాతం హామీలు నెరవేర్చారన్నారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారమే ఇప్పుడు పింఛన్‌ను రూ.3 వేలుకు పెంచారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్నివర్గాల్లోని ప్రజలకు లబ్ధి జరిగేలా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ నేతలు లేనిపోని మాయ మాటలు చెప్పి, మోసం చేసేందుకు సిద్ధమవుతారని, వారి మాటలు నమ్మవద్దన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికలప్పుడు హామీలు ఇవ్వడమే తప్ప వాటిలో 10 శాతం కూడా నెరవేర్చిన దాఖలాలు లేవని విమర్శించారు. అప్పటి టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని, అభివృద్ధి, సంక్షేమం కావాలంటే రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ మళ్లీ గెలిపించాలని కోరారు.

పెత్తందారులకు, పేదల మధ్య 'వార్'

రానున్న ఎన్నికల సమరం పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న వార్(యుద్ధం)గా మనం భావించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్ అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మేలు జరిగితేనే ఓటు వేయండి అని అడిగిన పార్టీని తానెన్నడూ చూడలేదని, ఇప్పుడు జగనన్న ప్రభుత్వం ఆ మాట అంటోందంటే ఏ మేర ప్రజలకు మంచి చేశామన్న ధైర్యమో అర్థం చేసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగనన్నకు అండగా నిలవాలని కోరారు. ఎన్ని పార్టీలు కలిసివచ్చినా మరోసారి వైఎస్సార్ సీపీదే విజయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, యువజన అధ్యక్షుడు వంజరాపు విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి మారుపేరు సీఎం జగన్..



బొబ్బిలి: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మారుపేరుగా నిలిచారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ప్రశంసించారు. మండలంలోని పిరిడి గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీకి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. అనంతరం ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. టీడీపీ హయాంలో చంద్రబాబు 606 హామీలు ఇచ్చి, వాటిలో ఒక్కటంటే ఒక్కటి కూడా సంపూర్ణంగా అమలుచేయలేదని విమర్శించారు. సీఎం జగనన్న మాత్రం ఎన్నికల మేనిఫెస్టోలోని 99.5 శాతం హామీలు నెరవేర్చారన్నారు. ఎన్నికల వేళ ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. గతంలోని టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని ప్రజలను కోరారు. గతంలో ఏ ఒక్క పథకం కావాలన్నా ఏ మేర కష్టపడాల్సి వచ్చేదో గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. ఇప్పుడు ఇంటి వద్దకే పథకాలు వచ్చి చేరుతున్నాయన్న విషయం మర్చిపోకూడదన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. పక్క రాష్ట్రం ఒడిశాలో రూ.500 పింఛన్ ఇస్తున్నారని, ఇక్కడ ఇకనుంచి రూ.3 వేలు పింఛన్ ఇస్తారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, సర్పంచ్ తుట్ట వరలక్ష్మి, ఎంపీడీవో పి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: పిరిడిలో జరిగిన కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

సంప్రదాయంగా సంక్రాంతి సంబరాలు



రామభద్రపురం: రామభద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ముగ్గులు పోటీలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



బొబ్బిలి: సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు

ప్రభుత్వ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాలల ఆవరణలు రకరకాల రంగవల్లులతో అందంగా ముస్తాబయ్యాయి. ఉపాధ్యాయులు విద్యార్థులతో భోగిమంటలు వేయించి, పతంగులు ఎగురవేశారు. పండగ విశిష్టతను వివరించారు. చిన్నారుల డూడూ బసవన్న, హరిదాసు వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

– బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్



సంతకవిటి: హరిదాసు వేషధారణలో బాలుడు



సంతకవిటి: బొద్దూరు పాఠశాలలో గోమాతను పూజిస్తున్న దృశ్యం



రాజాం: పెనుబాక పాఠశాలలో చీరకట్టులో విద్యార్థినులు



రేగిడి: ఏవీపురం పాఠశాలలో ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థినులు



రాజాం: విద్యార్థుల డూడూ బసవన్న వేషధారణ

క్షయవ్యాధి నివారణే ప్రభుత్వ లక్ష్యం



రామభద్రపురంలోని చొక్కాపు వీధిలో సర్వే చేస్తున్న ఏఎన్‌ఎం, ఆశావర్కర్

రామభద్రపురం: క్షయవ్యాధి(టీబీ/ట్యూబర్క్యులోసిస్) నివారణే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని రామభద్రపురం, ఆరికతోట పీహెచ్‌సీల వైద్యాధికారులు దిలీప్‌కుమార్, శిరీష, రత్నదీపక్, అపర్ణ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో టీబీ వ్యాక్సినేషన్‌కు వైద్యారోగ్య సిబ్బంది సోమవారం చర్యలు చేపట్టారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు కలిసి టీబీ రోగుల కోసం సర్వే నిర్వహించారు. డయాబెటిక్, టీబీ రోగులతో పాటు 60 సంవత్సరాల వయసు దాటిన వారిని, వయసుకు తగ్గ బరువు లేనివారిని, బీడీ, చుట్ట తాగే అలవాటు ఉన్నవారిని గుర్తించి, వ్యాక్సిన్ వేసేందుకు వారి నుంచి అంగీకారం తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎవరూ టీబీ వ్యాధి బారినపడకుండా బీసీజీ వ్యాక్సిన్ వేస్తామన్నారు. టీబీ అనేది బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ వ్యాధి అని, ఇది ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. వ్యాధిగ్రస్తులు తుమ్మడం, దగ్గడం, ఉమ్మడం, చీదడం ద్వారా బాక్టీరియా గాలిలో కలిసి ఆరోగ్యవంతమైన వారికి వ్యాధి సోకుతుందన్నారు.

టీడీపీలోనే అయోమయం



మాట్లాడుతున్న మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు

బాడంగి: బొబ్బిలిలో టీడీపీ అభ్యర్థి ఎవరనే విషయంలో ఆ పార్టీ నేతల్లోనే అయోమయం నెలకొందని మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి తెర్లి శ్రీనివాసరావు, కోడూరు సచివాలయ కన్వీనర్ తెంటు సింహాచలం అన్నారు. ఇటీవల ఓ రెండు వార్తా పత్రికల్లో(సాక్షి దినపత్రిక కాదు) బొబ్బిలి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ తమ అభ్యర్థి ఎంపికపై అయోమయంలో ఉందనే వార్త ప్రచురితం కాగా, దీనిపై సదరు నేతలు స్పందించి, ఆయా పత్రికల్లో వచ్చిన వార్తను ఖండించారు. సోమవారం ఇదే విషయమై స్థానిక ఎంపీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన వారు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడునే పార్టీ అధిష్టానం అభ్యర్థిగా ఖరారు చేసిన విషయం తెలియక.. కొంతమంది అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, కాస్త అవగాహనతో మాట్లాడితే బాగుంటుందని హితవుపలికారు. టీడీపీ నియోజకవర్గ సీటు కోసం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బేబినాయనతో పాటు ఆయన సోదరుడు, మాజీ మంత్రి ఆర్.సుజయ్‌కృష్ణరంగారావు సైతం పోటీపడుతున్నారని, దీంతో ఆ పార్టీ అభ్యర్థి ఎవరనేది ఆ పార్టీ నేతల్లోనే గందరగోళం నెలకొందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలందరికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలా మేలు చేశారని, ఆయన వెంటే జనమంతా ఉన్నారని, రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం ఖాయమన్నారు. బొబ్బిలిలో చంద్రబాబు పర్యటించినంత మాత్రాన తమ పార్టీకి నష్టమేమీ లేదని, కొన్నిరోజుల క్రితం ఇక్కడ జరిగిన బీసీ సాధికార బస్సు యాత్రతోనే ఇది స్పష్టమైందన్నారు.

ఎంపీడీవోపై ఆరోపణలు

• ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శ

రామభద్రపురం: కారు అద్దె బిల్లు రూపంలో స్థానిక ఎంపీడీవో రమామణి ప్రభుత్వం నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ మిర్తివలస వైఎస్సార్ సీపీ నేత గిరడ షణ్ముఖనాయుడు(అలియాస్ భాస్కరరావు) ఆరోపించారు. ఇదే విషయమై ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయ కారు అద్దె ఎక్కువగా డ్రా అవుతుందన్న అనుమానంతో సమాచార హక్కుచట్టం ద్వారా వివరాలు సేకరించానన్నారు. 2022 జనవరి ఒకటో తేదీ నుంచి డిసెంబరు నెలాఖరు వరకు రోజుకు 100 నుంచి 120 కిలోమీటర్లు వరకు మూడేసి గ్రామాల్లో సందర్శించినట్లు రికార్డులో రాసుకుని, ప్రతీ మూడు నెలలకోసారి రూ.85,840లు ఎంపీడీవో డ్రా చేస్తున్నారని, ఇలా 2023 సెప్టెంబరు నెలాఖరు వరకు డ్రా చేశారని విమర్శించారు. మండల కేంద్రం నుంచి ఏ గ్రామమైనా 10 నుంచి 15 కిలోమీటర్లు మాత్రమే ఉంటుందని, రోజుకు మూడు గ్రామాలు సందర్శించి, వందకు పైగా కిలోమీటర్లు రాసి బిల్లులు డ్రా చేయడం మంచిది కాదన్నారు. బాధ్యత కలిగిన అధికారులే ఇలా చేస్తే ఎలా అని ప్రశ్నించారు. సదరు అధికారికి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. ఇదే విషయంపై ఎంపీడీవోను సంప్రదించగా, ఉదయం ఉపాధి హామీ పనులు పరిశీలన చేసి, ఆఫీస్‌కు వస్తాం.. సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న ఆరోగ్య సురక్ష, మధ్యలో సచివాలయాల సందర్శన వంటి కార్యక్రమాలకు వెళ్తుంటాం. మళ్లీ మధ్య మధ్యలో సచివాలయ నిర్మాణాల ఫొటోలు తీయమంటే తీయడానికి వెళ్తాం. అటు ఆఫీస్ పనులు, ఇటు ఫీల్డ్ పనులు రెండూ బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్తున్నాం. మాకు ఇచ్చిన కిలోమీటర్ల పరిమితికి మించి రాయడం కుదరదు. ఒకవేళ రాసినా సిస్టం అంగీకరించదు. ఉపాధి హామీలో వెహికల్ సదుపాయం లేదని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రాజాం సిటీ: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. డీపీఎం ఆనందరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలంటే ఎన్‌పీఎం షాపులు ఏర్పాటు చేయాలని, అలాగే ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలు వినియోగించుకోవాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, ఆరోగ్యవంతమైన పంట వస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి మండల స్థాయి పోటీలు

బాడంగి: మండలంలో ఈ నెల 10వ తేదీ నుంచి మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆంజనేయులు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, పాఠశాలల పీడీలతో సోమవారం సమావేశమైన ఆయన పోటీల నిర్వహణకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానం, గురుకుల పాఠశాల మైదానం, కోడూరు పాఠశాల మైదానం ఎంపిక చేశామన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోండి

రేగిడి: మండలంలో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. సోమవారం మండలంలోని చాటాయవలస, వన్నలి, అక్కన్నఅగ్రహారం, ఉప్పరనాయుడువలస గ్రామాల్లో చేస్తున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించిన ఆయన ఈ-క్రాప్ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు

రేగిడి: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో జి.శ్యామలాకుమారి హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల సభ్యులతో సోమవారం సమావేశమైన ఆమె మహిళల రక్షణ హక్కులు, వాటి పరిరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఎక్కడ ఎవరికి ఇబ్బంది ఎదురైనా వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు.

వంగర: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జి.రజనీదుర్గ, సీహెచ్ నూకాలమ్మ సోమవారం సమావేశమై, మహిళల రక్షణ చట్టాపై అవగాహన కల్పించారు.

జెడ్పీ చైర్మన్‌ను కలిసిన ఆస్పత్రి సూపరింటెండెంట్



జెడ్పీ చైర్మన్‌తో సంభాషిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిబాబు

రాజాం: పట్టణంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును రాజాం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావుతో పాటు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేషలు ఆయనతో మాట్లాడుతూ సకాలంలో రోగులకు సేవలు అందేలా చూడాలని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్మోహనరావు, పార్టీ రాజాం టౌన్, రూరల్ అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి

తెర్లాం: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, స్పందన కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి వచ్చిన ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవేళ సమస్య ఏ కారణం చేతనైనా పరిష్కరించడానికి వీలుకాకపోతే ఆ కారణాన్ని అర్జీదారుడికి తెలియజేయాలన్నారు. సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయకూడదన్నారు.

28 మద్యంసీసాల స్వాధీనం

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పాతబొబ్బిలిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి 28 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వి.జ్ఞానప్రసాద్ సోమవారం తెలిపారు. ఇదే ఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ

బాడంగి/రాజాం: మండలాల్లో పింఛన్ల పంపిణీ చాలా చురుగ్గా జరుగుతోంది. పెరిగిన పింఛన్లను కొత్తగా పింఛన్లు మంజూరైన వారితో పాటు పాత లబ్ధిదారులకు సైతం అందిస్తున్నారు. ఇదివరకు ఉన్న రూ.2 వేలు పింఛన్‌ను దశల వారీగా రూ.3 వేలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. ఈ నెల నుంచి పింఛన్‌దారులందరికీ రూ.3 వేలు పింఛన్ లభిస్తుండడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బొబ్బిలి: మండలంలోని పక్కి గ్రామంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, జగన్నాథపురంలో జెడ్పీటీసీ శాంతకుమారి, సర్పంచ్ బొద్దల పద్మా సత్యనారాయణల చేతులమీదుగా పింఛన్ల పంపిణీ సోమవారం చేపట్టారు.